క్లుప్తంగా...

నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కల్యాణ మహోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు ప్రకటించారు. సాయంత్రం 6.30 గంటలకు దేవాలయ ప్రాంగణంలో ఈ కల్యాణ మహోత్సవాన్ని చేపడుతున్నామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వివిధ రకాలు పూలు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. భజన నామసంకీర్తన, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి ఎల్లమ్మ ప్రతిష్ఠాపన పూజలు

మణికొండ: గండిపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలను సోమవారం నుంచి మే 4 వరకు నిర్వహిస్తున్నామని 3 న జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి చేతుల మీదుగా యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠాపన , నాభిశిల ప్రాణ ప్రతిష్ఠ పూజలు ఉంటాయన్నారు. కౌన్సిలర్‌లు గోపాల సునీతాగణేష్, విజేత ప్రశాంత్ యాదవ్‌లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కంటి ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



సినీనటుడు టార్జన్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ తదితరులు

శంషాబాద్: పట్టణంలోని యాదవ్ బస్తీలో మోర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అత్తాపూర్ ఐరిఎస్ ఆసుపత్రి వారు నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో సుమారు 150 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి కళ్లద్దాలను అందజేశారు. కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయరాదని సినీనటుడు టార్జన్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ సూచించారు. మోర్డ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు శ్రీనివాస్, కౌన్సిలర్ సంజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పునః ప్రతిష్ఠాపన

రాజేంద్రనగర్: శివరాంపల్లి అంబాయమ్మ కాలనీలోని అమ్మవారి దేవాలయంలో పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. అంబాయమ్మ దేవాలయ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాలతో పాటు హోమం పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు సీతాపతి ఆధ్వర్యంలో పూజలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పిట్టల శివముదిరాజ్, నరేష్‌ముదిరాజ్, విజయ్, అర్జున్, సాయి ప్రశాంత్‌గౌడ్, సాయి, కిరణ్‌ముదిరాజ్, నరేష్, వాసుగౌడ్, సిద్ధం శ్రీను, విశాల్ తదితరులున్నారు.

పదవీ విరమణ



ఎస్.టీ.వీరోజీరావును సన్మానిస్తున్న ఉద్యోగులు

రాజేంద్రనగర్: పీ.వీ.నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.టీ.వీరోజీరావు పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కార్మికులు ఆయనకు పూల బోకే అందజేసి శాలువాతో సన్మానించి వీడ్కోలు తెలిపారు. యశ్వంత్‌యాదవ్, రాఘవేందర్, కిషోర్, నవీన్ తదితరులున్నారు.

అల్ ఖైర్ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంపు

గోల్కొండ: గోల్కొండలోని అల్ ఖైర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వివిధ రకాల కోర్సుల సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నామని కోర్సు కో ఆర్డినేటర్ యాయాబిన్ హసన్ తెలిపారు. 40 రోజుల పాటు ఒక్కొక్క కోర్సు ఉంటుందని ఆయన తెలిపారు. కంప్యూటర్ ఏడీసీఏ, స్పోకెన్ ఇంగ్లిష్, మొబైల్ రిపేరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ అండ్ టైలరింగ్, మెహందీ డిజైనింగ్, ఏసీ టెక్నీషియన్ కోర్సును మే 1 నుంచి నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మహిళలకు సాయంత్రం వేళల్లో ఈ శిక్షణ తరగతులు ఉంటాయని ఆయన తెలిపారు. ఇతర వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం 77318 41591లో సంప్రదించవచ్చు.

మన్‌కీ బాత్‌తో నేరుగా ప్రధాని ప్రజలతో మమేకం

రాజేంద్రనగర్: మన్‌కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధాని మోదీ నేరుగా ప్రజలతో మమేకమైయ్యారని పలువురు నేతలు కొనియాడారు. ప్రధాన మంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమం 100వ ఎపిసోడ్ నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం బీజేపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అపార్ట్‌మెంట్‌లు, బస్తీలు, కాలనీలు, యువజన కేంద్రాల్లో వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు.

- రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, శాస్త్రీపురం డివిజన్‌లలో ఈ కార్యక్రమాలను ప్రజల కోసం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్లు సంగీతాగౌరీశంకర్, తోకల శ్రీనివాస్‌రెడ్డితో పాటు డివిజన్‌ల అధ్యక్షులు బాబురావు, విజయ్‌కుమార్, అడికే జనార్దన్, నిఖిల్‌లు తమ డివిజన్‌లలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో వీక్షించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ.. ప్రతి రాష్ట్రం, జిల్లా, మండల, గ్రామ, బస్తీలలో జరుగుతున్న ప్రతి విషయాన్ని ప్రధాని నేరుగా ప్రస్తావిస్తున్నారన్నారు.



తొండుపల్లిలో ప్రధాని మన్‌కీబాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నేతలు, స్థానికులు

శంషాబాద్‌లో..

శంషాబాద్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన వైపే ప్రజలంతా మొగ్గుచూపుతున్నారని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందకుండా కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ 100 మన్‌కీబాత్ కార్యక్రమాన్ని శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ బాత్కు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో తొండుపల్లిలో ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడారు.. బీజేపీ ద్వారానే రాష్ట్రంలో కూడా సుపరిపాలనకు బాటలు వేసేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని అభిప్రాయపడ్డారు. బీఆర్‌ఎస్‌ను సాగనంపే యజ్ఞంలో ప్రజలందరూ భాగస్వాములయ్యేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



హైదర్‌గూడలో..



అత్తాపూర్‌లో..

వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి కాలనీలో వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలజ్ఞాని అవతార పురుషుడు వీర బ్రహ్మేంద్ర స్వామి అని కొనియాడారు. ఆయన చెప్పిన కాలజ్ఞానం ఇప్పుడు మనం చూస్తున్నామన్నారు. ప్రపంచంలో ఏ వింత జరిగినా.. ఇది వీరబ్రహ్మేంద్ర స్వామి వారు తన కాలజ్ఞానంలో ఆనాడే చెప్పారని ప్రజలు జ్ఞప్తికి తెచ్చుకుంటారన్నారు. మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు సురేష్‌గౌడ్,



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

కార్పొరేటర్లు శ్రీలతసురేష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, తలారి చంద్రశేఖర్, నాయకులు నాగరాజు, అంతారం నరేష్, రాజిరెడ్డి, జగదీష్‌గౌడ్, కాలనీవాసులు నరసింహచారి, రాజశేఖర్, శంకర్‌నాయక్, శ్రీధర్, సంతోష్, సుందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో నిర్వాణ- 2023

మణికొండ: ఎంజీఐటీ కళాశాల 26వ వార్షికోత్సవ సందడి నిర్వాణ-2023లో భాగంగా విద్యార్థులు ఆట, పాటలతో దుమ్ము లేపారు. గత మూడు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాలు శనివారం అర్ధరాత్రి ముగిశాయి. ముగింపు ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ టాటా నర్సింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ఆర్థికాభివృద్ధి, ఎదుగుదలలో అంకుర పరిశ్రమలు, తయారీ రంగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. మేక్‌ఇన్ ఇండియాతో రూపాయి బలోపేతం అవుతుందన్నారు. గౌరవ అతిథి కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ డైరెక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ.. పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాభివృద్ధిని ఎప్పటికప్పుడు తమ ఆలోచన విధానాన్ని మార్చుకుంటూ.. లక్ష్యాన్ని



చేరుకోవాలన్నారు. ఎల్‌ఐటీ మైండ్ ట్రీ వైస్ ప్రెసిడెంట్ అమర్‌నాథ్, కళాశాల చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, బోర్డు సభ్యులు పద్మ, క్రాంతి, సంధ్యశ్రీ, ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.సుధాకర్‌రెడ్డిలతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



ఆటపాటలతో విద్యార్థుల సందడి

కాలనీ వెల్ఫేర్ నూతన కార్యవర్గం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భవానీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నూతన కమిటీని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని కార్పొరేటర్ భూపాల్‌గౌడ్ అన్నారు. ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షులుగా అశోక్, ఉపాధ్యక్షులుగా శైలజ, ప్రధాన కార్యదర్శిగా జీవన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా అశోక్‌రెడ్డి, ట్రెజరర్‌గా నాగేశ్వర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీ సమగ్రాభివృద్ధికి తోడ్పాటును అందించాలని నూతన కార్యవర్గాన్ని



నూతన కార్యవర్గ సభ్యులతో కార్పొరేటర్ భూపాల్‌గౌడ్

కోరారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు.

దేవాలయ వ్యవస్థాపక దంపతులకు సన్మానం

బండ్లగూడ: దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ విజయగణపతి దేవాలయం, తుల్జా భవానీ దేవాలయాల వ్యవస్థాపకులు కటారి రామ్‌నరేష్ తెలిపారు. భాగ్యనగర్ కాలనీ, ఇండస్ వ్యాలీ, సంజయ్ గాంధీనగర్ కాలనీ వాసులు ఆదివారం రామ్‌నరేష్ దంపతులను ఘనంగా సన్మానించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సయ్యద్ ఖాజా, మహిపతి రామచంద్ర గుప్తలు వారిని అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.



కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్

రాజేంద్రనగర్: తమ అపార్ట్‌మెంట్ పక్కనే ప్లాస్టిక్ గోదామ్ కారణంగా తాము రోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక అపార్ట్‌మెంట్ వాసులు కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్‌కు వివరించారు. ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా ప్లాస్టిక్ గోదామును నిర్వహిస్తున్నారని దీని పక్కనే గ్యాస్ గోదామ్ సైతం ఉందన్నారు. అపార్ట్‌మెంట్ పక్కనే ప్లాస్టిక్ గోదామ్ ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు తెలిపారు. విద్యుత్ సమస్య అధికంగా ఉందని లోఓల్టెజీతో పాటు తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. కాలనీలో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ పరిశ్రమపై జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్, పారిశుద్ధ్య విభాగం అధికారులకు సమాచారం అందించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ఆపరేషన్ పోలోతో దాష్టిక పాలన నుంచి విముక్తి

శంషాబాద్: ఆపరేషన్ పోలో ద్వారా నాటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్‌పటేల్ చేపట్టిన చర్యలతో దాష్టిక పాలన నుంచి విముక్తి లభించిందని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మురళిమనోహర్ అన్నారు. ఆదివారం శంషాబాద్, కందుకూరు, మహేశ్వరం మండలాల నుంచి హాజరైన వారితో ఆదివారం పట్టణంలోని జైత్రి గార్డెన్‌లో 'ప్రతిష్ఠన సమ్మేళనం' నిర్వహించారు. నిజాం



సమ్మేళనంలో పాల్గొన్న కార్యకర్తలు

దుర్మార్గమైన పాలనకు ఆపరేషన్ పోలో చరమగీతం పాడిందన్నారు. నాటి పరిపాలన సంబంధిత విషయాలు.. పోరాటాలపై ఈ సందర్భంగా విస్తృతంగా చర్చించారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి, ఖానాపూర్ గ్రామాలకు చెందిన అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ సారథ్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరారు. వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్టు ప్రకటించి వారంతా ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారితో పాటు ఖానాపూర్ మాజీ సర్పంచ్ మన్నె గండయ్య ఆధ్వర్యంలో కొంత మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కండువా వేసుకున్నారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, స్వామిదాస్, యాదయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



ఓపెన్ నేషనల్ అబాకస్ కాంపిటీషన్- 2023



విద్యార్థులతో నిర్వాహకులు

రాజేంద్రనగర్: హెరిటేజ్ ప్యాలెస్‌లో ఓపెన్ నేషనల్ అబాకస్ కంపిటీషన్-2023 పోటీలను నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రకు చెందిన దాదాపు 500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 'మెంటల్ అర్థమెటిక్స్ అబాకాస్ ఆల్ ఇండియా ట్యాలెంట్ సెర్చ్' ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నిర్వాహకురాలు గోపి మల్లేశ్వరి మాట్లాడుతూ.. స్మార్ట్ కిడ్స్ లర్నింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఎందరో విద్యార్థులకు అబాకస్ ద్వారా మెథమెటిక్స్‌లో నైపుణ్యాలను బోధించినట్లు తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దినట్లు వివరించారు. నాలుగు రాష్ట్రాలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొనడం హర్షించదగ్గ విషయమన్నారు. సుస్మితరాయ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. పాఠశాలలో 1987-88వ బ్యాచ్‌కు చెందిన 40 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా తమ చిన్ననాటి జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ.. ఒకరికొకరు ఉల్లాసంగా గడిపారు. పాఠశాలలో నాడు చదువుకున్న విద్యార్థుల వివరాలను సేకరించి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సురేష్, మధుయాదవ్, కనకమామిడి ప్రవీణ్‌కుమార్, విజయ్‌సారథి, జాన్, రాకేష్ తదితరులున్నారు.

సేవ చేస్తే భగవంతుని దీవెనలు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

మణికొండ: మనకు తోచిన విధంగా మరొకరికి సేవ చేసిన వారికి భగవంతుడి దీవెనలు ఎప్పుడూ.. ఉంటాయని డాక్టర్ స్మిత డేనియల్ అన్నారు. మణికొండ, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని సేవియర్స్ లూథెరన్ చర్చిలో ఒకేషనల్ బైబిల్ స్కూల్ తరగతుల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. పిల్లలు ప్రేమతో, సంపూర్ణ హృదయంతో వినయం, మంచి ప్రవర్తనత తోటి వారికి సేవ చేస్తూ జీవించాలని సూచించారు. అలాంటి వారిపై భగవంతుని దీవెనలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులు 'సెర్వ్ వన్ అనదర్ థీమ్'తో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వీబీఎస్ డైరెక్టర్ మెర్సీరాజ్, సూపరెండెంట్ స్మిత రాజేష్, ఉపాధ్యాయులు శృతి, సుస్మిత రాజ్, సుగుణ వెస్లీ, ప్రతిభ, డేవిడ్, పాస్టర్ రామకృష్ణ తదితరులున్నారు.

ప్రజలకు ఇబ్బందిగా ఉన్న దిమ్మెల తొలగింపు !



నార్సింగి ట్రాఫిక్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సాగర్‌గౌడ్



జేసీబీతో దిమ్మెలను తొలగిస్తున్న దృశ్యం

బండ్లగూడ: ప్రధాన రహదారిపై దిమ్మెలను ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ సాగర్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బండ్లగూడ చౌరస్తా నుంచి కాళీకానగర్‌కు వెళ్లేందుకు వీలు లేకుండా అధికారులు సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేశారన్నారు. సిగ్నల్ పడిన ప్రతిసారి ప్రజలు కాళీకానగర్ మీదుగా ప్రయాణిస్తుండటంతో ట్రాఫిక్ పోలీసులు వీటిని ఏర్పాటు చేశారన్నారు.

- కాళీకానగర్ ప్రజలు వీటి కారణంగా ప్రధాన రహదారికి రాలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న దిమ్మెలను తొలగించాలని నార్సింగి ట్రాఫిక్ సీఐ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన ఆయన రహదారిలో ఉన్న సిమెంట్ దిమ్మెలను తొలగింపజేశారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలు

మణికొండ: ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలను మణికొండ మున్సిపాలిటీ పరిధి పుప్పాల్‌గూడ కాశీ విశ్వేశ్వర ఆలయంలో వాసవి వెల్ఫేర్ అసోసియేషన్, వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున కుంకుమార్చనలో పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారు తమను చల్లగా చూడాలని ఆకాంక్షించారు.



అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న మహిళలు

నాలాలో పడిన చెట్టును తొలగించండి



శేరిలింగంపల్లి: నాలాలో కూలిన చెట్లను తొలగించడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. లింగంపల్లి నుంచి తారానగర్ వరకు ఉన్న నాలాలో నల్లగండ్ల కూరగాయల మార్కెట్ కల్వర్టు వద్ద ఇటీవల కూలిపోయింది. దీంతో అకాల వర్షాలకు వచ్చే వరదకు చెత్తాచెదారం చెట్టు కొమ్మలకు తగలి నిలిచిపోతున్నాయి. భారీ వర్షాలు వస్తే నాలాలో వ్యర్థాలు పొరుకపోయి వరద మార్కెట్‌ను ముంచెత్తే ప్రమాదం ఉందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు సమస్య పరిష్కారానికి వెంటనే చొరవ తీసుకొని నాలాలో పడిన చెట్టు కొమ్మలను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని మార్కెట్ వ్యాపారులు కోరుతున్నారు.